# ఇది నా సలహా, వింటావా?



[illegible]

“ఎందుకూ, నడిరోడ్డుమీద నిలబడి విస్తుపడి నలువైపులా చూస్తున్నావు? రేపేమిటి చెయ్యడమా అని ఆలోచనా? కుటుంబం ఎలా గడుస్తుందని దిగులా? బ్రతు కెలాగని భయమా? పిచ్చివాడా, నామాట విను. చచ్చిపో. ఏదో నుళువు చూసుకొని కళ్లుమూసీ!

గవర్నమెంటు రేషనుకూడా తగ్గించేసేరు. రోజుకి నాలుగు అవున్సుల బియ్యం. అందులోనే ధాన్యం, నూకలు, రాళ్లు, అన్నీ కలిపిపోస్తారు. నువ్వు దానిమీద ఎలా బ్రతకగలవ్? నీకొక అర్థ సావు బియ్యం కొలవడానికి పదిసార్లు లెక్కపెట్టు కుంటున్న గవర్నమెంటుకి ఎంత సరదగా ఉంటుంది, నీపేరు రికార్డులలోంచి తొలగిపోతే!...... ఈ లోకంలో మనుష్యులే లేకుండా చేదామని ప్రపంచంలోని ప్రభుత్వాల కోరిక! వారి కోరిక తీర్చడానికేనా, నీకు చచ్చిపోవాలని లేదా?

మొలచుట్టూ తిరిగి రావడానికి తగిన గుడ్డముక్క దొరకడం లేదని ఎందుకా చింత? ఇండియాలో కావలసినన్ని మిల్లులున్నాయి; లక్షలకొద్దీ గజాల గుడ్డ తయారవుతోంది; ఆ మాట విని అయినా సంతోషించకుండా, అదంతా ఎక్కడికి పోతోందా అన్న లేనిపోని జిజ్ఞాస ఎందుకూ? నీ గుక్కెడు ప్రాణాలూ నీ బొందెలో కొట్టుకుంటున్నాయిలే కదా నీకీ తాపత్రయం? అసలు బాధ ప్రాణం ఉండడంలోనే ఉంటే ఈ పైపై వాటి గూర్చి నీ వెందుకు అలా కొట్టుకు పోతావ్?

ఎంత దూర మని అలా కాళ్లరిగి పోయేటట్టు తిరుగుతావ్? — ఉద్యోగాల కోసం? ప్రతీ ఆఫీసు ముందూ ఉన్న ‘ఉద్యోగంలేదు’ బోర్డులు కనబడడంలేదూ? చూస్తూ కూడా ఆ ఆఫీసులోకి ఎందుకు జొరబడతావ్! వాడిచేత చీవాట్లు తిన డానికా?... పిచ్చివాడా, నీ ఒక్క ప్రాణం కోసం ఎంత తల్లడిల్లి పోతున్నావు! కరువు ముంచెత్తిన ఈ లోకంలో నిలద్రొక్కుకొని ఉండి పోక పోతే ఏమి వచ్చింది!... అదిగో, ఇప్పుడే ‘ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్’ ఆఫీసు నుంచి




వస్తున్నావు! ఎన్నిసార్లు నాయనా ఆ గుమ్మం ఎక్కేవు? వారు మాత్రం నీకు కనుపించని ఉద్యోగాలు ఏ తెర వెనుకనుంచి సృష్టిస్తారు? నీలాటి నిరుద్యోగులే వారుకూడా పూర్వం. ఎవడో దయామయుడు వారికా దారి చూపేడు. అంతే! లేదు నాయనా, లాభం లేదు. నీవు ఎంతకాలం ఈ లోకం పట్టుకు వేలబడతావో, నీవంత కిందికి జారిపోతూ ఉంటావు.


ఆ మేడల వేపు చూస్తూ ఉంటే నీకెంత సేపటికి కడుపు నిండుతుంది? ఆ మెట్లు ఎక్కడానికేనా

నీకు అర్హతలేదే! నీవొక బికారివి. ఒక్క కానీ చేతిలోలేని వాడివి. వారితో పోలిస్తే నీకు ఏమైనా విలువుందా? రోజూ ఎన్ని జంతువులు, ఎన్ని క్రిములు కారుల క్రిందపడిపోతున్నాయో? నీలాంటివారు ఎంత మంది ఈ భారతదేశంలో నిలువనీడ, తిన తిండిలేక,



మలమల మాడిపోతున్నారో! వారందరిగూర్చి విచారించడానికే వారా మేడలలో ఉన్నారనుకున్నావా?...నీ ప్రత్యేకత ఏమిటి?...వారికి కనిపించేది డబ్బు. డబ్బే వారిముందు నాట్యంచేస్తూ ఉంటుంది. డబ్బున్నవాళ్లే వాళ్లకి మనుష్యుల లాగ కనిపిస్తూఉంటారు. వారు నీకు సహాయం చేస్తారే అనుకున్నావా? 'అయినా వారెందుకు నీకు డబ్బు ఇయ్యాలి? కష్టపడి సంపాదించేరు. అసలు రహస్యం తెలియని నీలాంటి, నాలాంటివారిని మోసగించి సంపాదించేరు. సంపాదించిన దానిని నిలవ ద్రోక్కేరు...నీకూనాకూ ఇవ్వడానికే సంపాదించే రనుకున్నావా? పిచ్చివాడా, నీకుగూడా అంతడబ్బు దొరికితే నువ్వుగూడా మేడగోడల మధ్య తాళాలు వేసుకొని, కళ్లుమూసుకు కూర్చుంటావు!

ఎందుకు బ్రతుకుతావ్? నామాట విను. చూడు, బియ్యమా దొరకడంలేదు. బట్ట లసలేలేవు... డబ్బు కళ్ళబడడంలేదు. ఎన్నిచోట్ల తిరిగినా కానీ పుట్టించగలిగే ఉద్యోగంలేదు. ఇంకా ఎందుకు బ్రతుకుతున్నావ్? ఎన్ని లేకపోయినా, నీ భార్య ఎంత పతివ్రతోగాని, ఏడాదికొక కొడుకు చొప్పున సమర్పించుకుంటోంది. అంతా దైవేచ్ఛ! నువ్వు మాత్రం ఏంచెయ్యగలవ్! తినడానికి తిండిలేదు, వీడికింతమంది పిల్లలేమిటి? అని నలుగురూ అంటున్నారు కదూ? అంటారు. నేనూ విన్నాను. డబ్బుకీ సంతానానికీ సంబంధంలేదని తెలీదు వారికి. రావుగారికి ఆరుగురు కొడుకులు; మొన్న కానుపుకి మళ్లా కూతురు. సోమేశ్వరంగారికి ఆరుగురు కొడుకులు, ఏడుగురు ఆడపిల్లలు. రెడ్డిగారికి ముగ్గురు పిల్లలకు పెంపకం ఇవ్వగా, ఇంకా పదిమంది ఉన్నారు, పాపం ఆ ఇల్లాలు మళ్లా నెలతప్పింది. వీరంతా దోషులుకారు. వీరికి డబ్బు ఉంది. బ్లేకు మార్కెటులో ఎంత ఖరీదు పెట్టిఅయినా కొని, కావలసిన వస్తువులు తేగలరు. అట్టివారి ధర్మమా అని 'బ్లేకు' మహాచల్లగా నడుస్తోంది. వారి సంతానం లోకానికి కన్నుల పండుగ. నీకు పుట్టిన పిల్లలే దేశానికి బరువు. అందరూ నిన్ను అనేవారే, నీ దోషం అందులో ఏదో ఉన్నట్టు. ఎవరిపిల్లలయినా దేశంలో ఉన్న ఆహారాన్నే, పండిన పంటనే కదా తింటారు? ఒకడు పీకమొయ్యా తింటూ, ఇంకొకడు పస్తు ఉన్నాడంటే అది బీదవారి సంతానం వల్లనేనా? లోకంలో జనసంఖ్య హెచ్చిపోతోందిట? బియ్యం కంట్రోలు, బట్ట కంటోలు వీటితో



పాటు, ఈ సంతానానికి కంట్రోలు పెట్టకూడదూ? గవర్నమెంటు తిండి పెట్టలేకపోతే, పుట్టిన, పుట్టబోయిన పిల్లలకుకూడా ఈ కష్టా లవసరంలేకుండా హాయిగా ఒకత్రోవ చూపించ కూడదూ?

అయినా, ఆ విషయాలన్నీ నీకెందుకు? నువ్వెంత బుర్రమొత్తుకున్నా నీకు సహాయం చేసేవారెవరూ లేరు. నువ్వు అనేవాడివి బతికి ఉన్నట్టు ఎప్పుడు తెలుస్తుందో తెలుసునా? నీ వోటు కావలసి వచ్చినప్పుడే! నీ ఓటు ఏదో ఒక డొక్కులో పడిపోవడంతో నీ బాధ్యత తీరిపోతుంది. ఆపైన నీ ఊసే అక్కరలేదు: అయినా


నీలాంటి దరిద్రులకి ఆ గవర్నమెంటులో హక్కు ఏదీ? నువ్వొక్కడివీ లేక పోతే లోకానికి ఏం లోటు? గవర్నమెంటు నీకేదో సహాయం చేస్తుం దనుకోకు. ఒక్క చిన్నపని చెయ్యాలీ అంటే ఏడాది పాటు ఆలోచించండీ ఈ ప్రభుత్వాలు ఏమీ చెయ్యలేవు. కనీసం బుర్రలు మార్చే శక్తేనా లేక




పోతే, నువ్వు ఏ పార్టీ లోనూ రాణించలేవు. ఏ పార్టీ తోటీ సంబంధం లేకుండా, నువ్వు నేటి ప్రజాప్రభుత్వంనుండి ఎట్టి సహాయమూ పొందలేవు: ఎన్నెన్నో మొహమాటాలతోటీ, మద్రాసు ఎవరి కిద్దామా అన్న ప్రశ్నలతోనూ తలలు బరువెక్కిన మంత్రులు నిన్నూ, నన్నూ చూస్తారనుకున్నావా? వట్టిమాట! పదపోదాం... ఈ లోకంలో ఉంటే, ఇంక మతిపోవడంతప్ప లాభంలేదు. ఏభై రూపా యిల జీతం తెచ్చుకుంటూన్న పెద్దమనిషి రోజుకి అర్థపావు బియ్యం తింటూ, ఆరునెలల్లో, కృష్ణపక్ష చంద్రుడులా హరించిపోతున్నాడు. గవర్నమెంటు నిజంగా, తెలియకుండా మనుష్యులను హరింపజేసే ఈ సరికొత్తపద్ధతి పెట్టడంలో ఎంతో మంచిపనే చేసింది. అయినా నీవెందుకు ఈచిత్రవధకు లోబడ తావ్ నామాటవిను. చచ్చిపో—

అదిగో, మళ్లా అరుగుమీద కూర్చున్నావు. ఇంకా నీకీ లోకంమీద, ఈ పెళ్లాం పిల్లలమీద మోహం పోలేదు. చూడు - మూడు పెద్ద రాజ్యాలు గ్రద్దలలా కూర్చున్నాయి. ప్రపంచాన్ని కబళించడానికి – ముందో వెనుకనో ప్రపంచమంతా మరోసారి యుద్ధంలో మునుగక తప్పదు: ఆటం బాంబు సంగతి నీకు తెలుసును కదూ? వందల మైళ్ల దూరంలో ఉన్నవారుకూడా బ్రతకరట! ఇంకెంత! దగ్గరలోనే ఉంది! ఆ వింతగూడా చూసి చచ్చిపోదామని ఉందా? పిచ్చివాడా, ఎందుకా తాపత్రయం? ఈ లోకమే వింత. విన్న కనుపించని 'ఈ రోజు' పుట్టడము, గడవడము, మళ్లా నిన్నగా మారిపోడం ఎంతటి వింతో ఊహిం చుకో. కాలం నడిచి పోతుంది. దాని పాదాలక్రింద ఎన్నో జీవాలు నశించిపోతాయి. నీ వొక లెక్క కాదు. ఎందుకా ఆకలి మంటలో బాధపడతావ్? ఎందుకీ అర తులం రేషనుతో ఒళ్లు నీరస బెట్టు కుంటావ్? తిండి తగ్గించిన గవర్నమెంటు పని తగ్గించిందా? అయినా నీకేమిటి? ... పనే లేదు! అందుకే పూచీలేదు! చనిపోయే ముందు ఎవరికీ ఛార్జీ అప్ప చెప్పక్కరలేదు! — పద, నేను చెప్పిన మాట విను — చచ్చిపో.

ఏం? మీ ఊరి ప్రక్క నుంచి రైలులైను లేదూ? దానిమీంచి ఎప్పుడూ గుడ్సుబళ్లు రాత్రి పూట దీపాలు లేకుండా వెళ్లవూ? పోనీ, ఒకయేరో, చెరువో, ఏదో ఒకటి నిన్ను ముంచే పాటిది?— ఊరి చివర పాడు నుయ్యి ఉంది కదూ? మీ ఊరు నుంచి పట్నానికి ఎలక్ట్రిక్ లైను వేస్తున్నారు కదూ? పోనీ చిన్న తాడు ముక్కయినా దొర క్కపోదా? ఇంతకీ ఒక అగ్గి పుల్ల సరిపోతుందే? ఇన్ని అవకాశాలు ఉండేనా, ఇంకా బ్రతికి ఉన్నావ్! ఎవరి మీద ఆశ పెట్టుకొని ఇంకా



బొందిలో ప్రాణం నిలుపుకున్నావ్? నే చెప్పిన మాట విను. ఈధనస్వాములు, ఈ పెట్టుబడిదారులు, ఈ పెద్ద రైతులు, వారి వెనుక నిలిచే ఈ గవర్న మెంటులూ నీ ఊసే తలపెట్టరు. ఈ రోజు నువ్వు హరీమంటే ఫలానా వ్యక్తి, యీ ప్రపంచంలో పుట్టినట్లుగాని, కొన్నాళ్లు అష్టకష్టాలూపడి కాలాన్ని యీడ్చినట్టు గాని, ఇప్పుడు చనిపోయి సుఖంగా ఉన్నట్టుగాని ఎవరికీ తెలీదు. తెలుసుకుందికి ఎవ్వరూ ప్రయత్నించరు. అంచేత చచ్చిపో.....శుభస్య శీఘ్రం...ఆలస్యం చెయ్యకు. సుఖంగా బ్రతకాలంటే చచ్చిపో. వెంటనే చచ్చిపో—